ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలి



ప్రభుత్వ వైద్యులు, సిబ్బంది రక్షణ కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలి. వీరు ఏసమయంలోనైనా అందుబాటులో ఉండేవిధంగా ఉండాలి. ఈ క్విక్ యాక్షన్ కమిటీలో వైద్యులు సిబ్బంది, స్థానిక సామాజిక కార్యకర్తలు, పోలీసులు, విద్యావేత్తలు ఉండాలి. సమస్య ఏదైనా సమాచారం అందుకున్న వెంటనే ఆస్పత్రికి వచ్చి రెస్క్యూ చేయగలగాలి. ఆస్పత్రిలో సౌకర్యాల మెరుగుకు వీరి సిఫార్సులను పరిగణనలోకి తీసుకోవాలి. ఇలాంటి చర్యలు చేపట్టడం వల్ల వైద్యులు, సిబ్బందికి భద్రత ఉంటుంది.

–సుజాత, సూపరింటెండెంట్, గోపాలపట్నం కమ్యూనిటీ హెల్త్‌సెంటర్

మూడంచెల సెక్యూరిటీ ఉండాలి



రాత్రి వేళల్లో రోగులతో పాటు వారితో వచ్చే వారిని లోపలికి అనుమతించేందుకు మూడంచెల విధానంలో భద్రతా సిబ్బంది ఉండాలి. అవసరానికి మించి సహాయకులను పంపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. రాత్రి సమయంలో వచ్చే వారిలో కొంతమంది బెదిరిస్తుంటారు. కొందరి నడవడిక వల్ల మహిళా వైద్యులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. దీన్ని అధిగమించేందుకు విమానాశ్రయాల్లో మాదిరిగా భద్రత వ్యవస్థ ఉండాలి.

– డాక్టర్ చైతన్య, పీజీ విద్యార్థి

రాత్రి డ్యూటీ అంటే భయమే



రాత్రి వేళలో ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది ఎవరైనా విధులు నిర్వహించాలంటే భయం భయంగానే ఉంటుంది. గతానికి భిన్నంగా పరిస్థితులు మారిపోయాయి. ఏ చిన్న సంఘటన జరిగినా వైద్యులు, సిబ్బందిని బాధ్యులుగా భావించి దాడులకు పాల్పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో రాత్రి డ్యూటీ అంటే భీతిల్లాల్సివస్తుంది. ప్రభుత్వం, పోలీస్ ఉన్నతాధికారులు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సమన్వయంతో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలి.

– హేమలక్ష్మి, నర్సింగ్ సూపరింటెండెంట్ అగనంపూడి ఏరియా ఆస్పత్రి

క్లుప్తంగా

మర్యాదపూర్వక కలయిక



మాజీ సీఎం జగన్‌తో డిప్యూటీ మేయర్ శ్రీధర్

గోపాలపట్నం: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని నగర డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ మర్యాదపూర్వకంగా కలిశారు. అచ్యుతాపురం సెజ్‌లో జరిగిన ఫార్మా ప్రమాదంలో క్షతగాత్రులను పరామర్శించడానికి శుక్రవారం విశాఖ వచ్చిన జగన్‌మోహన్‌రెడ్డిని విమానాశ్రయంలో శ్రీధర్ కలిశారు.పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు .

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి మృతదేహం

గోపాలపట్నం: ఎన్‌ఏడీ జంక్షన్ గణేష్ నగర్ వద్ద రైలు కింద తలపెట్టి వ్యక్తి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. జీఆర్‌పీ పోలీసులు తెలిపి వివరాలు ఇలా ఉన్నాయి. గుర్తు తెలియన వ్యక్తి (సుమారు 45 నుంచి 50 ఏళ్ల) రైలు కింద తలపెట్టి మృతి చెందాడు. మృత దేహం వద్ద ఎలాంటి వివరాలు లేక పోవడంతో గుర్తు తెలియని మృతిగా నమోదు చేశారు. అయితే ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద సంచరిస్తూ యాచన చేయడం, ఎవరైనా పని చెబితే చేస్తూ జీవనం సాగిస్తుండే వాడని కొందరు చెబుతున్నారు. అంతకు మించి వివరాలు తెలియరాలేదు. మృతుడి కుడి చేతిపై త్రిశూలం, చతుర్భుజం వంటి మూడు పచ్చబొట్లు ఉన్నాయి. ఈ వ్యక్తి పూర్తి వివరాలు తెలిస్తే 9494887786 నంబర్‌కు సమాచారమివ్వాలని కోరారు.

దోపిడీ ముఠా సభ్యుల అరెస్ట్

మర్రిపాలెం: ఈ నెల 21వ తేదీ రాత్రి కాన్వెంట్ జంక్షన్ వద్ద దారి దోపిడీకి పాల్పడిన ఇద్దరిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు కంచరపాలెం క్రైం సీఐ నిమ్మకాయల శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. ఘటనకు సంబంధించిన వివరాలు.. మురళీ నగర్ ప్రాంతానికి చెందిన బోర్ల మధు (22) జ్ఞానాపురం వద్ద అంతిమయాత్ర వాహన డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. బుధవారం రాత్రి 8 గంటలకు విధులు ముగించుకుని ఇంటికి వెళ్లేందుకు కాన్వెంట్ జంక్షన్ వద్ద వేచి ఉన్నాడు. ఈ క్రమంలో అటుగా హోండా యాక్టివాపై వస్తున్న ముగ్గురు వ్యక్తులు అతన్ని అటకాయించి అతని వద్ద ఉన్న రూ.200 నగదు, మొబైల్ ఫోన్ లాక్కొని ఉడాయించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన పోలీసులు బృందంగా ఏర్పడి ముగ్గురిలో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. మధురవాడ ప్రాంతానికి చెందిన గరుగుబిల్లి చైతన్య, శ్రీకాకుళం జిల్లాకు చెందిన గంగు భాస్కర్రావులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు పంపించారు. మరో నిందితుడు గోపి పరారీలో ఉండడంతో అతని కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

డిజిటల్ యుగంలో అప్రమత్తత అవసరం

విశాఖ సిటీ: డిజిటల్ యుగంలో ఉద్యోగులు అవగాహన, భద్రత పాటించడం అవసరమని విశాఖ పోర్టు అథారిటీ డిప్యూటీ చైర్మన్ దుర్గేష్‌కుమార్ దూబే సూచించారు. విజిలెన్స్ అవగాహన వారోత్సవాలలో భాగంగా శుక్రవారం పోర్ట్ పరిపాలన భవనంలోని సాంబమూర్తి ఆడిటోరియంలో సైబర్ సెక్యూరిటీపై అధికారులు, ఉద్యోగులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డిప్యూటీ చైర్మన్‌తో పాటు చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ పి.ఎల్.ఎల్.స్వామి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం సైబర్ మోసాలు, నేరాల నుంచి ఎలా తప్పించుకోవాలనే అంశాలను సైబర్ సెక్యూరిటీ నిపుణులు వివరించారు.

ప్రయాణం.. నరకప్రాయం

ఆ మార్గంలో ప్రయాణ మంటే ప్రజలు హడలిపోతున్నారు.ఏ గొయ్యిలో పడి గాయాలపాలు కావాల్సి వస్తుందోనని భయపడుతున్నారు. ఇక ఉద్యోగులు అయితే ట్రాఫిక్‌లో చిక్కుకుని వేళకు కార్యాలయాలకు చేరుకోలేక పోతున్నామని వాపోతున్నారు.తక్షణమే స్పందించి రోడ్డును అభివృద్ధి చేయాలని విన్నవిస్తున్నారు.

- చెరువును తలపిస్తున్న రోడ్డు
- గంటల కొద్దీ నిలిచిపోతున్న వాహనాలు
- అవస్థలు పడుతున్న ఉద్యోగులు



ట్రాఫిక్‌లో ఇరుక్కున్న ఉద్యోగులు



ములగాడ నుంచి శ్రావణి షిప్పింగ్‌కు వెళ్లే మార్గంలోని గుంతల్లో నిలిచిన వర్షపు నీరు

మల్కాపురం: డాక్‌యార్డ్ వంతెన మూసి వేయడంతో ములగాడ సేవా మార్గానికి రాకపోకల తాకిడి పెరిగింది.అసలే ఈ మార్గం పూర్తిగా గుంతల తో నిండి ఉంది. దీనికి తోడు తీవ్ర ట్రాఫిక్ సమస్య నెలకొనడంతో గ్రామస్తులు,వాహనదారులు,పాదచారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

ఇదీ పరిస్థితి

జీవీఎంసీ 58వ వార్డు ములగాడ,చిన్న ములగాడ గ్రామంలో సుమారు 4500 మంది నివాసం ఉంటున్నారు. ఈ గ్రామాలు వార్డు శివారు ప్రాంతంలో ఉంటాయి.ములగాడ గ్రామానికి ఆనుకుని శ్రావణి షిప్పింగ్,ఆలూఫ్లోరైడ్ వంటి సంస్థలు ఉన్నాయి.అయితే ములగాడ గ్రామం నుంచి శ్రావణి షిప్పింగ్‌కు, ఆలూఫ్లోరైడ్‌కు వెళ్లే బీటీ మార్గం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. మార్గమంతా పూర్తిగా గుంతలు ఏర్పడి,పిక్క తేలి ఉంది. దీంతో ఈ మార్గాన రాకపోకలు సాగించే వారు ఇబ్బంది పడుతున్నారు.

ప్రత్యామ్నాయం లేకే..

రోడ్డు ధ్వంసం కావడంతో గ్రామస్తులతో పాటు ఇతర ఉద్యోగులు గాజువాక ఆర్టీసీ డిపో మీదుగా శ్రీహరిపురం,మల్కాపురం,సింధియా మీదుగా నగరానికి లేదా వివిధ పరిశ్రమలకు వెళ్లేవారు. అయితే 20 రోజుల నుంచి డాక్‌యార్డ్ వంతెన మార్గం (సర్దార్ వల్లబాయ్ పటేల్ వంతెన) మరమ్మతుల నిమిత్తం అధికారులు మూసివేశారు. దీంతో సింధియా,మల్కాపురం,శ్రీహరిపురం,కోరమాండల్ వీటి చుట్టుపక్కల వాసులు నగరానికి వెళ్లాలన్నా,లేదా విద్యార్థులు కళాశాలలకు,వివిధ పరిశ్రమలకు ఉపాధి నిమిత్తం వేళ్లే వారు ములగాడ మీదుగా శ్రావణి షిప్పింగ్ గొడౌన్స్ దాటుకుని మారుతీ సర్కిల్ వైపు నగరానికి చేరుకుంటున్నారు.దీంతో ఈ మార్గం పూర్తిగా బిజీ బిజీగా మారిపోయింది. అసలే గుంతల మయంగా ఉన్న మార్గంలో ఇప్పుడు ట్రాఫిక్ సమస్య నెలకొనడంతో వాహనదారులతో పాటు,ములగాడ,చిన్నములగాడ,ఎదురవానిపాలెం ప్రాంత వాసులు నరకం చూస్తున్నారు. అధికారులు స్పందించి ఈ సేవా మార్గాన్ని అభివృద్ధి చేయాలని లేనిపక్షంలో నగరానికి వెళ్లే వారికి ప్రత్యామ్నాయ మార్గమైనా చూపాలని కోరుతున్నారు.



సర్వీసురోడ్డు గుంతలో దిగబడిన జీప్

ఇబ్బంది పడుతున్నాం



ఎప్పుడూ ప్రశాంతంగా ఉండే మా గ్రామాల మీదుగా వాహనాల రద్దీ పెరిగింది. దీంతో ట్రాఫిక్ సమస్య నెలకొంటుంది.ఫలితంగా మా పిల్లలను బయటకు పంపించేందుకు భయపడుతున్నాం. శ్రావణి షిప్పింగ్‌కు వెళ్లే మార్గం పూర్తిగా ధ్వంసం కావడంతో తీవ్ర ట్రాఫిక్ సమస్య నెలకుంటుంది. అధికారులు దీనిపై స్పందించాలి.

– శీరపు నర్సింగరావు, చిన్న ములగాడ గ్రామ అధ్యక్షుడు

కాలుష్యం బెడద



నిత్యం వేల సంఖ్యలో వాహనాల రాకపోకలతో గ్రామానికి కాలుష్య సమస్య ముప్పు వచ్చింది. మొన్న వరకూ మా గ్రామం ప్రశాంతతకు మారుపేరుగా ఉండేంది.ఇప్పుడు వాహనాల తాకిడితో పూర్తిగా అసౌకర్యంగా మారింది. రోడ్డుపై గుంతలతో పాటు ఇరుకు రోడ్డు వందలాది వాహనాలు ప్రయాణించడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అధికారులు స్పందించి సమస్యకు చెక్ పెట్టాలి.

–వడ్డపాటి రాజు, 58వ వార్డు ఎస్సీ సెల్ అధ్యక్షుడు

ఆక్రమణ దారుల బరితెగింపు!

అధికారుల హెచ్చరికలు బేఖాతర్



గణపతినగర్ కొండ ప్రాంతంలో ప్రభుత్వ భూమిని చదును చేస్తున్న దృశ్యం

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు ములగాడ హౌసింగ్‌కాలనీ దిగువ నుంచి జింక్ ఆంజనేయ స్వామి ఆలయానికి వెళ్లే మలుపు వద్ద సర్వే నెంబర్ 55లో విలువైన ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమిపై కబ్జాదారుల కన్ను పడింది. స్థానిక టీడీపీ నాయకుల అండతో విలువైన భూమిలో నిర్మాణాం చేపడుతున్నాడు. విషయం తెలుసుకున్న ములగాడ ఆర్ఐ రమేష్‌నాయుడు శుక్రవారం ఆ ప్రాంతానికి వెళ్లి నిర్మాణాన్ని తొలగించాలని ఆదేశించారు. అయినా సదురు వ్యక్తి చలించలేదు. ములగాడ మండల పరిధిలో అనేక అనధికార నిర్మాణాలు జరుగుతున్నాయని.. ముందు వాటిపై స్పందించండి అంటూ ఆర్ఐకే హుకుం జారీ చేశాడు. దీంతో అక్కడ ఉన్న వారు విస్తుపోయారు.

గణపతి నగర్‌లో..

ఇదే వార్డు గణపతినగర్ కొండ ప్రాంతంలో సర్వే నెంబర్ 55లో ఓ వ్యక్తి కొండను చదును చేస్తున్నాడు.దీని వెనుక స్థానిక టీడీపీ నాయకుడి అండ దండలు ఉన్నాయని బహిరంగంగా ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ములగాడ తహసీల్దార్ తారకేశ్వరిని వివవరణ కోరగా విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇప్పటికే ఆ ప్రాంతానికి ఆర్ఐ,వీఆర్వోలను పంపినట్టు తెలిపారు. మరింత కఠినంగా వ్యవహరించి,జీవీఎంసీ వారి సాయంతో అనధికార నిర్మాణాలు తొలగిస్తామన్నారు.

కృష్ణాష్టమి వేడుకలకు సర్వం సిద్ధం



శ్రీకృష్ణుడి విగ్రహానికి రంగులు దిద్దుతున్న దృశ్యం

మల్కాపురం: ఈ నెల 26వ తేదీన కృష్ణాష్టమి వేడుకలకు పారిశ్రామిక ప్రాంతంలోని శ్రీకృష్ణుడి మందిరాలు ముస్తాబు అవుతున్నాయి. 59వ వార్డు ములగాడ హౌసింగ్‌కాలనీ దరి గోకుల్ పార్కు వద్ద గల శ్రీకృష్ణుడి విగ్రహాన్ని యాదవ సంఘం ఆధ్వర్యంలో ముస్తాబు చేస్తున్నారు.అలాగే 61వ వార్డు మల్కాపురం యాదవ వీధిలోని శ్రీకృష్ణుడి మందిరంలో మహోత్సవాలను 26 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్టు శ్రీవిజ్ఞానమండలి యాదవ సంఘం ప్రతినిధులు తెలిపారు. తొలి రోజు సోమవారం ఉదయం 11 గంటల నుంచి పూజలు మొదలు కానున్నాయి. ముగింపు రోజు బుధవారం నాడు ఉట్లు సంబరం,స్వామి ఊరేగింపు,భారీ అన్న సమారాధన నిర్వహించనున్నారు.

మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన



అభ్యర్థులకు సూచనలు చేస్తున్న అధికారులు సుబ్బిరెడ్డి, శాంతి



ఇంటర్వ్యూకు హాజరైన అభ్యర్థులు

కంచరపాలెం : స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరియర్ సర్వీస్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించిదని జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారులు సీహెచ్ సుబ్బిరెడ్డి (క్లరికల్), కె. శాంతి (టెక్నికల్) తెలిపారు. సుమారు 8 ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో 480 ఖాళీల భర్తీకి నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 204 మంది అభ్యర్థులు హాజరైనట్లు తెలిపారు. వీరిలో 102 మంది అభ్యర్థులు ఎంపికయ్యారని తెలిపారు. వీరికి జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సీహెచ్ సుబ్బిరెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. ఎంపికైన అభ్యర్థులు 26వ తేదీ సోమవారం ఆయా కంపెనీలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో వెళ్లాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జూనియర్ ఉపాధి అధికారి సీహెచ్ కుమారస్వామి, ఎం.కె. మనోరమ, వివిధ కంపెనీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

డంపర్ బిన్‌తో దుర్గంధం



ఆర్పీపేట ఉన్నత పాఠశాల ప్రధాన గేటు వద్ద అడ్డంగా ఉన్న డంపర్ బిన్

కంచరపాలెం : స్థానిక కంచరపాలెం పరిధి రామ్మూర్తిపంతులుపేట ఉన్నత పాఠశాల ప్రధాన గేటు వద్ద జీవీఎంసీ పబ్లిక్ హెల్త్‌కు సంబంధించిన డంపర్ బిన్ ఏర్పాటు చేయడంతో పరిసరాలు దుర్గంధభరితంగా మారాయి. ప్రధాన గేటు ద్వారా కంచరపాలెం, ఆర్పీపేట ప్రాథమిక, రామ్మూర్తిపంతులుపేట ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ గేటునే వినియోగిస్తుంటారు. గేటుకు ఇరువైపుల చిరుతిళ్ల దుకాణాలు ఉండడంతో విద్యార్థులు అక్కడ దుకాణాల్లో మిఠాయిలు కొనుగోలు చేస్తుంటారు. డంపర్ బిన్‌లో చెత్తచెదారాలు నిండి రోడ్డుపై పడడంతో పశువుల సంచారం ఎక్కువగా ఉంది. అటుగా రాకపోకలు సాగించే పాదచారులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. డంపర్ బిన్ తొలగించమని శానిటరీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. విద్యార్థులు సీజనల్ రోగాల బారిన పడుతున్నారని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత జోన్–5 పబ్లిక్ హెల్త్ అధికారులు స్పందించి డంపర్ బిన్‌ను తొలగించాలని కోరుతున్నారు.

ఉత్సాహంగా యూత్ పార్లమెంట్ పోటీలు



పార్లమెంట్ నియమ నిబంధనలను వివరిస్తున్న ఎంపీ శ్రీభరత్

సింధియా: మల్కాపురంలోని కేంద్రియ విద్యాలయంలో 35వ రాష్ట్ర స్థాయి యూత్ పార్లమెంట్ పోటీలను శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి విశాఖ ఎంపీ శ్రీభరత్, న్యాయనిర్ణేతగా వి.ఎస్.పి.వి.ఎస్.మాధవ్ పాల్గొన్నారు. హైదరాబాద్ రీజనల్ ఆఫీస్ నుంచి అసిస్టెంట్ కమిషనర్ రెజి.వి.ఆర్.విశ్వనాథ్ ప్రత్యేక న్యాయమూర్తిగా విచ్చేశారు. కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ సత్యజిత్ మిశ్రా రాజకీయ నాయకులందరికీ సాదర స్వాగతం పలికారు. అనంతరం ఎంపీ శ్రీభరత్ పార్లమెంట్ నియమ నిబంధనల గురించి, అధికార పక్షాన్ని ఎలా ప్రశ్నించాలి, ప్రతిపక్షాన్ని ఎలా ఎదుర్కోవాలనే విషయాలను విపులంగా వివరించారు. మాజీ ఎమ్మెల్సీ మాధవ్ మాట్లాడుతూ విద్యార్థులు పార్లమెంట్ చట్టాలపై దృష్టి సారించాలని సూచించారు.

ఏయూలో జాబ్‌మేళా నేడు

ఎంవీపీకాలనీ: ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ ఇన్‌ఫర్మేషన్ అండ్ గైడెన్స్ బ్యూరో, నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్ ఆధ్వర్యంలో శనివారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం తెలిపారు.ఫ్లిప్‌కార్ట్, పేటీఎంలలో భర్తీ కోసం జాబ్‌మేళా ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 10.30 గంటలకు జాబ్ మేళా ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

పిచ్చి కుక్క స్వైరవిహారం



రోదిస్తూ గాయాన్ని చూపుతున్న రామారావు



కాలిపై గాయాన్ని చూపిస్తున్న బాలిక

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు పిలకవానిపాలెం గ్రామంలో వీధి కుక్కల సమస్య అధికంగా ఉంది. సమస్యపై స్థానికులు పలు మార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించక పోవడంతో చివరకు ఇవి ఆ మార్గాన వచ్చే వారిని గాయపరుస్తున్నాయి. శుక్రవారం సాయంత్రం పిలకవానిపాలెం సర్వీసు రోడ్డు వస్తున్న రామారావు అనే వ్యక్తిపై పిచ్చి కుక్క దాడి చేసి చేతి మణికట్టు, భుజం వెనుక భాగాన తీవ్రంగా గాయపరిచింది. అలాగే ట్యూషన్‌కు వెళ్తున్న 12 ఏళ్ల బాలికపై ఇదే పిచ్చి కుక్క దాడి చేసి కాలిపై గాయం చేసింది.ఇలా సుమారు పది మందిపై ఆ కుక్క దాడి చేయడంతో కాలనీలో కొంత మంది యువకులు ఆ పచ్చి కుక్కను తరిమి వేశారు. శుక్రవారం సాయంత్రం పిచ్చికుక్క దాడిలో గాయపడిన వారిని శివరెడ్డి తదితరులు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకు వెళ్లి వ్యాక్సిన్ వేయించారు.అధికారులు స్పందించి వీధి కుక్కలను నియంత్రించాలని స్థానికులు కోరుతున్నారు.

పాఠశాలల్లో ఫిర్యాదుల పెట్టెలు ఏర్పాటు చేయాలి


- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు సీతారాం



మాట్లాడుతున్న సీతారాం

విశాఖ విద్య : జాతీయ, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాలు, సూచనలను అనుసరించి పాఠశాలల్లో ఫిర్యాదుల పెట్టెలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం అన్నారు. శుక్రవారం ఆరిలోవ సెయింట్ ఆన్స్ పాఠశాలలో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్, జిల్లా విద్యాశాఖల సమన్వయంతో 'బాలల హక్కుల పరిరక్షణలో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు, వార్డు సచివాలయం కార్యదర్శులు పాత్ర'పై అవగాహన సదస్సు నిర్వహించారు. చినగదిలి మండల విద్యాశాఖాధికారి ఎం.రవీంద్ర అధ్యక్షత వహించగా జిల్లా గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి డాక్టర్ ఖలీషా బేగం సమన్వయకర్తగా వ్యవహరించారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ జిల్లా విద్యా శాఖ సమన్వయంతో పనిచేసి విద్యార్థినుల భద్రతకు కృషి చేయాలన్నారు. బాలలపై లైంగిక దాడులు, మంచి, చెడు స్పర్శలు, ఆడపిల్లల రుతు స్రావ సమయంలో ఆరోగ్య జాగ్రత్తలు, బాలల హక్కులు, మాదక ద్రవ్యాల నియంత్రణ వంటి వాటిపై అవగాహన కల్పించాలన్నారు. వీటిపై విద్యార్థులు స్వేచ్ఛగా తమ ఇబ్బందులను తెలియజేసేందుకు ప్రతీ పాఠశాల ప్రాంగణాల్లో ఫిర్యాదుల పెట్టెలు ఏర్పాటు చేయాలన్నారు. సీనియర్ సైకాలజిస్టులు పార్వతి కాశ్యప్, గాయత్రి మెడికల్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ సుభాష్ మాట్లాడుతూ ఇటువంటి అవగాహన కార్యక్రమాలు.. పిల్లలకు మేలుకలిగే ఎన్నో విషయాలు ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల ద్వారా చేరవేసేందుకు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల అసోసియేషన్ (అపుస్మా) రాష్ట్ర ట్రెజరర్ ఎం.వి. రావు, జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యురాలు లక్ష్మి, సర్వశిక్షా అభియాన్ పీడీ బి.శ్రీనివాసరావు, మండల విద్యాశాఖాధికారి–2 అనురాధ, అర్బన్ చైల్డ్ డెవలప్‌మెంట్ పీడీ శ్రీలత, జిల్లా బాలల సంరక్షణ విభాగం సిబ్బంది బి.శకుంతల,ఆనంద్, శారద, కార్మిక శాఖ అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఎం.విజయ, సెయింట్ ఆన్స్ పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ సుమతి పాల్గొన్నారు.


సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం



ఎన్నికల్లో విజయం సాధించిన డెలిగేట్లతో శ్రామిక్ యూనియన్ నాయకులు

తాటిచెట్లపాలెం : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై ఈస్ట్‌కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్ నిరంతర పోరాటం చేస్తుందని యూనియన్ ప్రధాన కార్యదర్శి పి.కె. పట్నాయక్ తెలిపారు. ఇటీవల జరిగిన రైల్వే కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఎన్నికల్లో డివిజనల్ కో ఆర్డినేటర్ పి. రామమోహనరావు నాయకత్వంలో ఘన విజయం సాధించిన యూనియన్ మద్దతుదారులతో శుక్రవారం సాయంత్రం దొండపర్తిలో గల యూనియన్ కార్యాలయంలో విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పట్నాయక్ ప్రతిష్టాత్మకంగా జరిగిన ఎన్నికల్లో ఘన విజయం సాధించిన అభ్యర్థులను, బ్రాంచ్ కార్యదర్శులను ఘనంగా సన్మానించారు. డివిజనల్ కో ఆర్డినేటర్ రామమోహనరావు మాట్లాడుతూ కార్మికుల పక్షాన ఎల్లప్పుడు పోరాటాలు చేస్తున్నందున యూనియన్ మద్దతుదారులను గెలిపించారన్నారు. కార్యక్రమంలో జోనల్ అధ్యక్షుడు పి.వి.జె. రాజు, ఆలిండియా రైల్వే మెన్స్ ఫెడరేషన్ జోనల్ సెక్రటరీ బి. దామోదరరావు, కేంద్ర నాయకులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కుపై కేంద్ర వైఖరి మారాలి



ఉక్కు దీక్షా శిబిరంలో పాల్గొన్న నాయకులు, కార్మికులు

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్ విషయంలో కేంద్ర వైఖరి మారాలని ఉక్కు పరిరక్షణ కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ డిమాండ్ చేశా రు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా కూర్మన్నపాలెం కూడలిలో ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ సారథ్యంలో చేపట్టిన రిలే దీక్షలు శుక్రవారం నాటికి 1289వ రోజుకు చేరాయి. శిబిరాన్ని సందర్శించిన ఆయన మాట్లాడుతూ విశాఖ ఉక్కును కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడానికి చూస్తుందని ఆరోపించారు. సొంత గనులు కేటాయించకపోవడం, ఐరన్ ఓర్‌ను ఉక్కుకు అందివ్వకుండా చేయడం ద్వారా విశాఖ ఉక్కు ఉత్పత్తికి విఘాతం కలిగిస్తున్నారని ఆరోపించారు. ముడి సరకు అందించి, సొంత గనులు కేటాయిస్తే లాభాల బాట పట్టిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు మసేనురావు, జె.రామకృష్ణ, కె.రాజబాబు, తాండ్ర కనకరాజు, బీఎంఎల్ నాయుడు, వరప్రసాద్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.